క్లుప్తంగా

పీపీకి నాయకుల సన్మానం



పీపీ వేణుగోపాల్ రెడ్డిని సన్మానించిన నాయకులు

మంచాల: జిల్లా సెషన్స్ కోర్టు అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమితులైన ఆరుట్ల గ్రామానికి చెందిన వేణుగోపాల్‌రెడ్డిని కాంగ్రెస్ పార్టీ నాయకులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువా కప్పి సన్మానం చేసి, శుభాకాంక్షలు తెలిపారు. పీపీని కలిసిన వారిలో పార్టీ రాష్ట్ర నాయకుడు కొంగర విష్ణువర్ధన్‌రెడ్డి, మండల నాయకులు ముచ్చర్ల వెంకటేశ్ యాదవ్, దండు హన్మంత్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, గుడ్డిమల్ల చంద్రయ్య, సురేష్, మహేందర్ రెడ్డి, పాండాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుడి కుటుంబానికి ఉద్యోగుల బాసట



బాధిత కుటుంబానికి సహాయం అందజేస్తున్న ఏడీఈ బాలకృష్ణ

ఆమనగల్లు: విద్యుత్ శాఖలో ప్రైవేట్ కార్మికుడిగా పనిచేసే నారమోని మల్లేశ్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. మృతుడి కుటుంబ సభ్యులను శుక్రవారం ట్రాన్స్‌కో ఇంజినీర్లు, ఉద్యోగులు, కార్మికులు పరామర్శించారు. అందరూ సమకూర్చిన రూ.2.05 లక్షలను బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో ఏడీఈ బాలకృష్ణ, ఆమనగల్లు, కడ్తాల్ ఏఈలు శంకర్‌నాయక్, నరేందర్, కార్మికులు నరేందర్‌రెడ్డి, లక్ష్మణ్, అశోక్, రాజశేఖర్, భానుప్రకాశ్, మల్లేశ్, శ్రీనివాసులు, మహేశ్, మణికంఠ, మౌజం, అజీం, పురుషోత్తం, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు డైరీల పంపిణీ



డైరీలతో విద్యార్థులు, చిత్రంలో ఉపాధ్యాయులు, నాయకులు

ఆమనగల్లు: ఆమనగల్లు మండలం శెట్టిపల్లి గ్రామ ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న చిన్నారులకు శుక్రవారం గ్రామానికి చెందిన కొమ్ము సాయికుమార్ స్కూల్ డైరీలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు మహేందర్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్, నర్సింహ, శ్రీను, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

సౌకర్యాల కల్పనకు ముందుకు రండి

మండల విద్యాధికారి పాండురంగారెడ్డి



విద్యార్థులకు డైరీలు అందజేస్తున్న దాతలు

యాచారం: ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాల కల్పనకు దాతలు ముందుకు రావాలని మండల విద్యాధికారి పాండురంగారెడ్డి కోరారు. మండల పరిధి గునుగల్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు విశ్రాంత ప్రొఫెసర్ తోటిరెడ్డి నర్సిరెడ్డి, జయశ్రీ దంపతులు శుక్రవారం డైరీలు అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. పేద విద్యార్థులు చదువుకుంటున్న సర్కారు బడుల బలోపేతానికి వ్యాపారవేత్తలు, ఉద్యోగులు, రాజకీయ నాయకులు తోడ్పాటునందించాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జగన్మోహన్‌రెడ్డి, ప్రేమలత, గిరిజ, శ్రీదేవి, ఉదయకుమారి, శారద, జ్యోతిరాణి, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

మాల్ బస్టాండ్‌ను వినియోగంలోకి తెస్తాం



డిపో మేనేజర్‌ను సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

యాచారం: మాల్ వ్యాపార కేంద్రంలో నిరుపయోగంగా ఉన్న ఆర్టీసీ బస్టాండ్‌ను త్వరలోనే వినియోగంలోకి తెస్తామని ఇబ్రహీంపట్నం ఆర్టీసీ డిపో మేనేజర్ వెంకటనర్సప్ప తెలిపారు. ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఆదేశాల మేరకు శుక్రవారం ఆయన మాల్ ప్రయాణ ప్రాంగణాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్‌ను కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ ముదిరాజ్ తదితరులు సన్మానించారు.

రాయితీతో సాగు.. ఆదాయం బాగు

మూడేళ్లు శ్రమిస్తే, మూడు దశాబ్దాలు సిరులు కురిపించే ఆయిల్ పామ్ సాగుపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. ప్రభుత్వ ప్రోత్సాహం, వ్యవసాయ అధికారుల అవగాహనతో .. కష్టనష్టాలను మిగుల్చుతున్న సంప్రదాయపంటలకు స్వస్తి పలికి, అధిక ఆదాయం వచ్చే పంటపై మరింతమంది మక్కువ చూపుతున్నారు.

తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి

- ఒక్కసారి నాటితే 30 ఏళ్లు సిరుల పంట
- భారీ సబ్సిడీతో మొక్కలు, డ్రిప్ పరికరాలు అందజేస్తున్న ప్రభుత్వం
- అవగాహన కల్పిస్తున్న ఉద్యాన, వ్యవసాయ శాఖ అధికారులు
- సాగుపై ఆసక్తి చూపుతున్న అన్నదాతలు



ఆయిల్ పామ్ తోటను పరిశీలిస్తున్న ఉద్యాన శాఖ అధికారులు

మహేశ్వరం: ఆయిల్ పామ్ సాగుతో ఎలాంటి సమస్యలు ఉండవని వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులు పేర్కొంటున్నారు. మూడు సంవత్సరాలు మొక్కలను జాగ్రత్తగా పెంచితే.. ముప్పై ఏళ్లు ఏటా ఎకరానికి రూ.2 లక్షల ఆదాయం పొందవచ్చని అవగాహన కల్పిస్తున్నారు. తొలుత మూడేళ్లు ప్రభుత్వం సబ్సిడీ అందిస్తుందని చెబుతున్నారు. ఆయిల్ పామ్ సాగు భూముల్లో అంతర పంటలను పండిస్తూ మరింత ఆదాయం పొందవచ్చని వివరిస్తున్నారు. దీంతో ఉద్యాన పంటలను సాగు చేసేందుకు అన్నదాతలు ముందుకు వస్తున్నారు.

ఎకరాకు 57 మొక్కలు

ఆయిల్ పామ్ మొక్క ఒక్కటి రూ.200లు ఉండగా, రైతులకు ప్రభుత్వం 90 శాతం రాయితీతో రూ.20లకే అందజేస్తోంది. ఎకరాకు 57 మొక్కలు అవసరం ఉండగా.. వీటి విషయంలో సబ్సిడీకి ఎలాంటి పరిమితి లేదు. పామ్ రైతులకు డ్రిప్ రాయితీ 12.5 ఎకరాలకు పరిమితం చేసింది. ఎస్సీ,ఎస్టీ రైతులకు 100 శాతం సబ్సిడీని అందిస్తోంది. యూనిట్ ధరపై 12 శాతం జీఎస్టీని రైతులు చెల్లించాలి. ఓసీ, బీసీ రైతులకు 80–90 శాతం రాయితీ ఉంటుంది. ఆయిల్ మొక్కలు నాటుకున్న రైతులకు ఎకరానికి రూ.4,200 చొప్పున 4 సంవత్సరాల పాటు నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేస్తారు. నాలుగో ఏట నుంచి దిగుబడి మొదలవుతుంది.

డిమాండ్ ఉన్న పంటలనే..

ఆయిల్ పామ్ సాగు, యాజమాన్య పద్ధతులపై వ్యవసాయ, ఉద్యాన వాఖ అధికారులు రైతులకు.. రైతు వేదికల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. పంటల సాగుపై, పంటల మార్పిడి విధానంపై సవివరంగా చెబుతున్నారు. సంప్రదాయ పంటలు కాకుండా, మార్కెట్లో డిమాండ్ ఉన్న వాటినే సాగు చేయాలని సూచిస్తున్నారు. పామ్ సాగుపై ప్రభుత్వం అన్ని విధాలుగా ప్రోత్సహిస్తుందని పేర్కొంటున్నారు.

అంతర పంటలతో మరింత మేలు

ఆయిల్ పామ్ సాగు చేసే వారు అదనపు ఆదాయాన్ని పొందేందుకు మంచి అవకాశాలున్నాయని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. ఈ సాగు మధ్యలో కూరగాయలు, మక్కలు, పల్లి, పత్తి, బొప్పాయి, సోయాబీన్, కొత్తిమీర, మెంతికూర వంటిని వేసుకొని, అదనపు ఆదాయాన్ని పొందవచ్చునని సూచిస్తున్నారు. ఆయిల్ మొక్కలు నాటిన నాలుగేళ్ల తర్వాత దిగుబడి వస్తుందని, అప్పటి వరకు అంతర పంటలతో జలసిరులు పొందవచ్చని స్పష్టం చేస్తున్నారు.

రైతు వద్దకే కంపెనీలు



మహేశ్వరం, కందుకూరు మండలాల్లో ఆయిల్ పామ్ సాగుకు అనువైన నేలలున్నాయి. ఆసక్తి ఉన్న రైతులకు ప్రభుత్వం.. మొక్కలు, సాగు పరికరాలు, ఎరువులను భారీ రాయితీతో అందజేస్తుంది. ప్రస్తుతం ఇరు ప్రాంతాల్లో 47 మంది.. సుమారు 300 ఎకరాల్లో పండిస్తున్నారు. పంట కాపునకు వచ్చిన తరువాత ఏటా ఆదాయం పొందవచ్చు. పంటను ప్రభుత్వం నిర్ణయించిన ధరకే కంపెనీలు నేరుగా రైతుల వద్దకు వచ్చి కొనుగోలు చేస్తాయి.

– సౌమ్య, ఉద్యాన శాఖ అధికారి, మహేశ్వరం

సమర భేరికి తరలిన కాంగ్రెస్ శ్రేణులు



ఆమనగల్లు: నగరానికి తరలిన కాంగ్రెస్ నాయకులు

అధికార పార్టీ కాంగ్రెస్.. శుక్రవారం నగరంలోని ఎల్బీ స్టేడియంలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆధ్వర్యంలో నిర్వహించిన 'కాంగ్రెస్ న్యాయ సమర భేరి'కి ఇబ్రహీంపట్నం, కల్వకుర్తి నియోజకవర్గాల నుంచి ఆ పార్టీ శ్రేణులు తరలివెళ్లారు. అంతకు ముందు ఆమనగల్లు, కడ్తాల్ తదితర ప్రాంతాలో పార్టీ నేతలు.. భారీగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం పార్టీ జెండాలు ఊపి, నగరానికి బయల్దేరారు.

–సాక్షి, నెట్‌వర్క్



మంచాలలో..



మాడ్గులలో..

రేపు ఉచిత రేబిస్ నివారణ టీకా

ఆమనగల్లు: ప్రపంచ జూనోసిస్ డేను పురస్కరించుకుని ఈ నెల 6న ఆమనగల్లు పట్టణంలోని పశు వైద్య కేంద్రంలో కుక్కలకు ఉచితంగా రేబిస్ వ్యాధి నివారణ టీకా వేయనున్నామని మండల పశువైద్యాధికారి డాక్టర్ చింతోజు అగ్నివేశ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శునకాల యజమానులు, జంతు ప్రేమికులు విధిగా వాటికి టీకా ఇప్పించాలని సూచించారు.

విద్యుత్ ఉండని ప్రాంతాలు

తుర్కయంజాల్: సబ్‌స్టేషన్ పరిధి బోటెక్ ఫీడర్ మరమ్మతుల కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నామని ఏఈ రవీందర్ రెడ్డి శుక్రవారం తెలిపారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 వరకు నాదర్‌గుల్‌లోని వైకే ఆర్ కాలనీ, జయసూర్యపట్నం, సి.బి.ఎన్‌క్లేవ్, సరస్వతి ఎన్‌క్లేవ్, సాగర్ ఎన్‌క్లేవ్, అంబేడ్కర్ నగర్, మారుతీ నగర్, టెంపుల్ టౌన్, చిల్కూరి ఎన్‌క్లేవ్, రఘు హోమ్స్, శ్రీరామ ఎన్‌క్లేవ్, ఆదిబట్ల శివాలయం, నాదర్‌గుల్ గ్రామం, అయోధ్య నగర్, శాంతి నగర్, ధరణీ ఎన్‌క్లేవ్, గ్రీన్ హోమ్స్, బాలాజీ హోమ్స్, మారుతి ఎన్‌క్లేవ్‌లో సరఫరాకు అంతరాయం కలగనుందని పేర్కొన్నారు. ఈ అసౌకర్యానికి చింతిస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

లో ఓల్టేజీ సమస్యకు పరిష్కారం చూపండి



ఏఈకి వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

అబ్దుల్లాపూర్‌మెట్: తరచూ తలెత్తుతున్న లో ఓల్టేజీ సమస్య పరిష్కారం కోసం నూతనంగా 100 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను కేటాయించాలని బలిజగూడ గ్రామస్తులు కోరారు. శుక్రవారం అబ్దుల్లాపూర్‌మెట్ ఏఈ నరేందర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం పలువురు మాట్లాడుతూ.. లో ఓల్టేజీ సమస్యతో నిత్యం ఫీజులు పాడవుతున్నాయని, ఎలక్ట్రానిక్ పరికరాలు కాలిపోతున్నాయని ఏఈ దృష్టికి తెచ్చారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించారని గ్రామస్తులు పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బుర్ర వీరస్వామి, నాయకులు ఉప్పు వెంకటేశ్, జ్ఞానేశ్వర్, సురేష్, నవీన్‌కుమార్, రమేష్, రాజేష్, వెంకటేశ్, జగన్, సతీష్ కుమార్, రైతులు పాల్గొన్నారు.

ఏఓగా బాధ్యతలు చేపట్టిన కవిత



కడ్తాల్: వ్యవసాయ శాఖ మండల అధికారిణి(ఏఓ)గా కవిత శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన శ్రీలత.. జిల్లా కేంద్రంలోని వ్యవసాయ శాఖ కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఏఓ కవిత మాట్లాడుతూ.. రైతులకు అందుబాటులో ఉండి సేవలందిస్తానని ఆమె తెలిపారు.

ఆరోగ్య సమస్యలకు ఔషధ వనం

హెచ్‌ఎం జంగయ్య



గార్డెన్ పనులను ప్రారంభిస్తున్న హెచ్‌ఎం

కడ్తాల్: సగటు మనిషి నిత్య జీవితంలో ఎదుర్కొంటున్న ఆరోగ్య సమస్యలకు ఔషధ వనం ఎంతగానో దోహదపడుతుందని జెడ్పీహెచ్‌ఎస్ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జంగయ్య అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పాఠశాలలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్, కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్(సీజీఆర్) పర్యావరణ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో యంగ్ ఎర్త్ లీడర్ కార్యక్రమంలో భాగంగా, కిచెన్ గార్డెన్, మెడిసినల్ గార్డెన్, ఫ్రూట్ గార్డెన్‌కు సంబంధించిన పనులను సంస్థ ప్రతినిధులు, ఉపాధ్యాయులతో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం హెచ్‌ఎం మాట్లాడుతూ.. విద్యార్థుల సమగ్రాభివృద్ధికి సంస్థ అందిస్తున్న సేవలు అభినందనీయమని కొనియాడారు. కిచెన్‌గార్డెన్, ఫ్రూట్ గార్డెన్‌ల ద్వారా సహజ సిద్ధమైన కూరగాయలు, పండ్లు అందుబాటులోకి వస్తున్నాయని పేర్కొన్నారు. విద్యార్థులకు ఆ కూరగాయలతో వండిన ఆహారంతో పాటు.. తాజ పండ్లను ఇస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సంస్థం కోఆర్డినేటర్ రజనీకాంత్, సంస్థ సభ్యుడు జ్ఞానేశ్వర్, ఉపాధ్యాయులు బీముడు, భాగ్యలక్ష్మి, విద్యార్థులు ఉన్నారు.

మౌలిక సౌకర్యాల కల్పనకు కృషి

ఎంపీడీఓ శైలజ



పంచాయతీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎంపీడీఓ శైలజ

మహేశ్వరం: నూతనంగా ఏర్పడిన గంగారం గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని ఎంపీడీఓ శైలజ అన్నారు. శుక్రవారం మహేశ్వరం మండలం గంగారం గ్రామంలో ఎన్ఆర్‌జీఈఎస్ నిధులు రూ.20 లక్షలతో పంచాయతీ భవన నిర్మాణానికి ఆమె గ్రామస్తులతో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం మాట్లాడుతూ.. గ్రామంలో పంచాయతీ భవన నిర్మాణ పనులు ప్రారంభించామని, క్రమంగా ద్వాక్రా, అంగన్‌వాడీ, ఎస్సీ,ఎస్టీ,బీసీ కమ్యూనిటీ భవనాలు, గ్రామ రెవెన్యూ కార్యాలయంతో పాటు పలు ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణం కోసం కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఏఈ వర ప్రసాద్‌రెడ్డి, కార్యదర్శి నవీన్ కుమార్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు మునావత్ పాండు నాయక్, ఎం.దేవేందర్ నాయక్, సూర్య నాయక్, రవి నాయక్, దేవా నాయక్, బీఆర్‌ఎస్ నాయకులు రవి నాయక్ పలువురు పాల్గొన్నారు.

ప్రజారోగ్య పరిరక్షణే ప్రభుత్వ ధ్యేయం



బాధితులకు చెక్కులు అందజేస్తున్న నాయకులు

కడ్తాల్: ప్రజారోగ్య పరిరక్షణే ధ్యేయంగా ప్రభుత్వం సీఎం సహాయనిధి పథకం అమలు చేస్తుందని పీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, మార్కెట్ వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం జిల్లా మాజీ అధ్యక్షుడు గూడూరు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో.. మండల కేంద్రానికి చెందిన లక్ష్మణ్‌కు రూ.52 వేలు, రాజేందర్‌గౌడ్‌కు రూ.25 వేలు, బాల్‌రెడ్డికి రూ.28 వేలు, కర్కల్‌పహాడ్ గ్రామానికి చెందిన అనిల్‌కు రూ.24 వేలు, నసీమాబేగంకు రూ.39 వేలు, చల్లంపల్లికి చెందిన శంకరయ్యకు రూ.60 వేలు, వాస్‌దేవ్‌పూర్‌కు చెందిన మణికిరణ్‌కు రూ.15 వేలు ముఖ్యమంత్రి సహాయ నిధి కింద చెక్కులు మంజూరు అయ్యాయి. ఈ మేరకు శుక్రవారం మండల కేంద్రంలో బాధితులకు వారు అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్రీపాతి శ్రీనివాస్ రెడ్డి, మార్కెట్ డైరెక్టర్లు నరేశ్‌నాయక్, అజీమ్, నాయకులు జహంగీర్‌అలీ, లక్పతినాయక్, చందోజీ, పర్వతాలు, బాలరాజు, ముత్తికృష్ణ, శ్రీనునాయక్, మహేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులపై సోషల్ ఆడిట్



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఆర్‌పీ కాశన్న

కడ్తాల్: రెండు మూడు రోజుల్లో గ్రామాల వారీగా ఉపాధి పనులపై సోషల్ ఆడిట్ ప్రారంభం కానుందని ఈజీఎస్ స్టేట్ రిసోర్స్ పర్సన్(ఎస్ఆర్‌పీ) కాశన్న తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంపై మండల స్థాయి అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. మండలంలో 2024–25 ఆర్థిక సంవత్సరంలో ఈజీఎస్‌లో చేపట్టిన రూ.2.80 కోట్ల పనుల గురించి గ్రామాల వారీగా సోషల్ ఆడిట్ నిర్వహించేందుకు ఈజీఎస్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లతో సమన్వయ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీఓ లాలయ్య, ఏపీఓ లలిత, టీఏలు వాణి, శ్రీనివాస్, సద్గుణ, ప్రేమలత, పంచాయతీ కార్యదర్శులు తిరుపతి, శంకర్, ఫీల్డ్ అసిస్టెంట్లు సంఘం మండల అధ్యక్షుడు వెంకటేశ్ తదితరులు ఉన్నారు.

రోశయ్య సేవలు చిరస్మరణీయం



రోశయ్య చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఆమనగల్లు: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, దివంగత నేత కొణిజేటి రోశయ్య రాష్ట్రానికి, కాంగ్రెస్ పార్టీకి అందించిన సేవలు చిరస్మరణీయమని పీసీసీ సభ్యుడు అయిల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. రోశయ్య జయంతిని పురస్కరించుకుని శుక్రవారం ఆమనగల్లు పట్టణంలోని జాతీయ రహదారిపై రాజీవ్ కూడలిలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో చెంచు యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మండ్లి రాములు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, మార్కెట్ మాజీ వైస్ చైర్మన్ కేశవులు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జగన్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీకాంత్, పట్టణ అధ్యక్షుడు మానయ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు శ్రీశైలం, రవీందర్, నాయకులు అలీం, ప్రసాద్, శ్రీనివాస్‌రెడ్డి, మల్లయ్య, ఖాదర్‌ఖాద్రి, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీని తనిఖీ చేసిన ఎంఈఓ



వంట సామగ్రిని పరిశీలిస్తున్న ఎంఈఓ సర్దార్ నాయక్

మాడ్గుల: మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలను శుక్రవారం మండల విద్యాధికారి సర్దార్ నాయక్ తనిఖీ చేశారు. బోధన తీరు, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. స్టోర్ రూమ్, కిచెన్, టాయిలెట్స్, వంట పాత్రలు, కూరగాయల రికార్డులు పరిశీలించి, తగిన సూచనలు చేశారు. విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరు కావాలని చెప్పారు. చిన్నారులకు నాణ్యమైన విద్యను అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. వర్షాకాలం సీజనల్ వ్యాధులు సోకకుండా పాఠశాల పరిసరాలు, తరగతి గదులు, వంటగది పరిశుభ్రంగా ఉండేలా చూడాలని నిర్వాహకులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్‌ఓ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే సతీమణి కన్నుమూత



ముత్యాలమ్మ(ఫైల్)

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం మాజీ ఎమ్మెల్యే కొండిగారి రాములు సతీమణి ముత్యాలమ్మ(75) గుండెపోటుతో శుక్రవారం తెల్లవారు జామున బృందావన్‌కాలనీలోని వారి నివాసంలో కన్నుమూసారు. సీపీఎం పార్టీ నుంచి రెండుసార్లు రాములు.. ప్రాతినిధ్యం వహించారు. ఆయనకు ఇద్దరు కుమారులున్నారు. విషయం తెలుసుకున్న పలువురు ప్రముఖులు ముత్యాలమ్మ పార్థివదేహానికి నివాళులు అర్పించారు. ఇందులో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ వెంకటరమణారెడ్డి, మాజీ కౌన్సిలర్స్ శంకర్‌నాయక్, సురేష్, నాయకులు వేణుగోపాల్‌రావు, రాజులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు లక్ష్మీపతిగౌడ్, మాజీ సర్పంచ్ విష్ణువర్ధన్‌రెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శి పి.యాదయ్య, జిల్లా నాయకులు సామేల్, ఎల్లేష్, బుగ్గరాములు, అరుణ, కేవీపీఎస్ నాయకులు పురుషోత్తం తదితరులు ఉన్నారు. ముత్యాలమ్మ అంత్యక్రియలు శుక్రవారం సాయంత్రం ఇబ్రహీంపట్నంలో ముగిసాయి.

పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య

- సామాజిక న్యాయంకోసం పోరాడిన ధీరుడు
- ఆయన జీవితం స్ఫూర్తిదాయకం: వక్తలు



తుర్కయంజాల్: కొమురయ్య చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న బీఎస్పీ నాయకులు



ఇబ్రహీంపట్నం: కొమురయ్య విగ్రహానికి నివాళి అర్పిస్తున్న చేతి వృత్తిదారుల సంఘాల నేతలు

ఇబ్రహీంపట్నం/ తుర్కయంజాల్: తెలంగాణ సాయుధ పోరాటంలో రజాకార్ల వెన్నులో వణుకు పుట్టించిన బహుజన వీరుడు దొడ్డి కొమురయ్య అని బీఎస్పీ మున్సిపాలిటీ అధ్యక్షుడు పట్నం రమేష్ కురుమ అన్నారు. కొమురయ్య వర్ధంతిని పురస్కరించుకుని శుక్రవారం తుర్కయంజాల్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ.. జమిందారీ వ్యవస్థకు వ్యతిరేకంగా సామాజిక న్యాయ కోసం పోరాడి అమరుడైన ఆయన జీవితం స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో బీఎస్పీ మున్సిపాలిటీ ఉపాధ్యక్షుడు ఎల్.రాజు, ప్రధాన కార్యదర్శి మల్లెల రఘు, కార్యదర్శి జంతుక సైదులు తదితరులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నంలో..

రైతాంగ సాయుధ పోరాటంలో దున్నేవాడికే భూమి కావాలని, వెట్టి చాకిరి నుంచి విముక్తి పొందాలని పోరాటం చేసి అసువులు బాసిన అమరుడు దొడ్డి కొమరయ్య అని చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ జి.నర్సింహ్మ అన్నారు. కొమురయ్య వర్ధంతి సందర్భంగా శుక్రవారం ఇబ్రహీంపట్నం కట్టపై ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన ఆశయ సాధనకు నిరంతరం కృషిచేస్తామని తెలిపారు. కార్యక్రమంలో వివిధ వృత్తి సంఘాల నాయకులు విఘ్నేష్, మల్లేశ్, సీహెచ్ శంకర్, శ్రీశైలం, యాదగిరిచారి, వెంకన్న, నరసింహ్మ, పి.కృష్ణ, రమేష్, పెంటయ్య తదితరులు ఉన్నారు.